నైపుణ్య శిక్షణ.. ఉపాధికి ఆలంబన

- ఐటీఐ స్టీల్‌సిటీలో స్కిల్‌హబ్ ఏర్పాటు
- మొదటి బ్యాచ్‌లకు కొనసాగుతున్న శిక్షణ
- విద్యార్థుల్లో పెరుగుతున్న ఆసక్తి

యువతలో ప్రతిభ అపారం. సరైన మార్గంలో దిశానిర్దేశం చేయగలిగితే భవిత ఉజ్వలం. వారిలోని సహజ నైపుణ్యాలకు శిక్షణ తోడైతే అద్భుతాలను ఆవిష్కరించగలరు. ఆసక్తి గల రంగంలో మరింతగా రాణించగలరు.. దీనిని గుర్తించిన ప్రభుత్వం ఆ దిశగా ఏర్పాటు చేసినవే నైపుణ్య శిక్షణ కేంద్రాలు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఐటీఐ స్టీల్‌సిటీలో ఏర్పాటైన ఈ కేంద్రంలో శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి.

పెదగంట్యాడ: నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలను కల్పించేందుకు పెదగంట్యాడలోని ప్రభుత్వ ఐటీఐ స్టీల్ సిటీలో ఏర్పాటు చేసిన స్కిల్‌హబ్‌లో శిక్షణ తరగతులు క్రమం తప్పకుండా సాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ కేంద్రాన్ని గతేడాది అక్టోబర్ 22న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. అదే నెల 25 నుంచి శిక్షణ తరగతులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఇక్కడ రెండు ట్రేడుల్లో శిక్షణ ఇస్తున్నారు. అందులో ఒకటి లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ కాగా మరొకటి మెయింటెనెన్స్ ఫిట్టర్ ట్రేడ్.

డ్రైవింగ్ శిక్షణ


డ్రైవింగ్ శిక్షణలో విద్యార్థులు

లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ ట్రేడ్‌లో 16 మంది విద్యార్థులు శిక్షణ తీసుకుంటున్నారు. ఈ శిక్షణ 45 రోజుల పాటు ఉంటుంది. ప్రతి రోజూ ఉదయం 10.15 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. డ్రైవింగ్‌లో శిక్షణ పొందిన వారు సొంతంగా ట్యాక్సీ లేదా లగేజ్ క్యారియర్ వ్యాన్లను నడుపుకొనే అవకాశం ఉంటుంది. భవిష్యత్తులో వారు తమ కాళ్లపై నిలబడే విధంగా ఇక్కడి సంస్థలో తర్ఫీదు ఇస్తున్నారు. వారిని నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్నారు. ఈ బ్యాచ్ అయిన వెంటనే మరో బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభిస్తామని స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ హైమావతి తెలిపారు.


మెయింటెనెన్స్ ఫిట్టర్ విద్యార్థులకు శిక్షణ

మెయింటెనెన్స్ ఫిట్టర్ ట్రేడ్‌లో..

మెయింటెనెన్స్ ఫిట్టర్ ట్రేడులో మొత్తం 30 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి మూడు నెలల పాటు శిక్షణ ఉంటుంది. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి. వివిధ పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. సొంతంగా వ్యాపారాలు చేసుకోవడానికి కూడా ఈ శిక్షణ ఉపకరిస్తుంది.

శిక్షణపై విద్యార్థుల్లో ఆసక్తి



స్కిల్ హబ్‌లో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థుల్లో రోజు రోజుకూ ఆసక్తి పెరుగుతోంది. మా కేంద్రంలోని రెండు ట్రేడ్‌లకు మంచి డిమాండ్ ఏర్పడింది. రోజూ విద్యార్థులు క్రమం తప్పకుండా హాజరవుతున్నారు. శిక్షణ బాగా సాగుతోంది. మెయింటెనెన్స్ ఫిట్టర్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు స్టీల్‌ప్లాంట్‌లో అప్రెంటిస్‌షిప్‌కు హాజరు కావడం విశేషం.
– డి.హైమావతి, స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్

ఉపాధికి మంచి మార్గం



ప్రస్తుతం పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులను తయారు చేయాల్సి వస్తోంది. పదో తరగతి పాసైన వారు, ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసిన వారికి ఆసక్తి గల రంగంలో శిక్షణ ఇస్తే వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసినట్టవుతుంది. ప్రస్తుతం రెండు ట్రేడ్‌లలో బ్యాచ్‌లకు శిక్షణ ఇస్తున్నాం. బ్యాచ్‌కు శిక్షణ పూర్తి అవుతున్న సమయంలో కొత్త బ్యాచ్‌లకు నోటిఫికేషన్ ఇస్తాం. ఏ ట్రేడ్‌లో శిక్షణ ఉంటుందనేది పేపరు ప్రకటన ద్వారా తెలియజేస్తాం. యువత ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిర పడాలి. – లండా సుధాకరరావు, ఐటీఐ ప్రిన్సిపాల్

క్లుప్తంగా

మొక్కలతో పర్యావరణ సమతుల్యత

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలస గ్రామదేవత మరిడిమాంబ ఆలయ ఆవరణలో సంపంగి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అగనంపూడి సీడబ్ల్యూసీ ఉపాధ్యక్షుడు విందుల నూకరాజు మాట్లాడుతూ ఆలయాలు, పబ్లిక్ ప్రదేశాల్లో విరివిగా మొక్కలను నాటడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో బి.సత్యనారాయణ, శేఖర్, రామస్వామి, అప్పారావు, లోకేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌బీఎస్ ఎన్నికల బరిలో నలుగురు అభ్యర్థులు

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌ఈఎల్‌లో ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్న ఫ్యామిలీ బెనిఫిట్ సొసైటీ (ఎఫ్‌బీఎస్) ఎన్నికల బరిలో నలుగురు అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఈ ఎన్నికల్లో 408 మంది ఉద్యోగులు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ప్రతీ ఓటరు రెండు ఓట్లు వేసి, ఇద్దరు అభ్యర్థులను ఎన్నుకోవల్సి ఉంటుంది. కాగా.. సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ ప్యానల్ నుంచి ఇద్దరు అభ్యర్థులు బరిలో నిలవగా, యునైటెడ్ ఫ్రంట్ ప్యానల్ నుంచి ఇద్దరు పోటీలో ఉన్నారు.

ముందుగా గుర్తిస్తే గ్లకోమా నివారణ


డాక్టర్ కె.వి.ఎస్.ఆర్.సంధ్య

అక్కిరెడ్డిపాలెం: గ్లకోమా, నీటి కాసులు వ్యాధి అనేది దీర్ఘకాలిక అంధత్వానికి దారి తీసే వ్యాధి అని షీలానగర్ కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ ఆప్తామాలజిస్ట్ అండ్ ఫాకో సర్జన్ డాక్టర్ కె.వి.ఎస్.ఆర్.సంధ్య అన్నారు. గ్లకోమా అవగాహనా వారోత్సవాలను పురస్కరించుకొని ఆస్పత్రిలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్లకోమా వ్యాధిగ్రస్తులు సుదీర్ఘ కాలం కంటిలో ఒత్తిడి పెరగడం వల్ల కంటి నరం దెబ్బతిని, చూపును కోల్పోతారని చెప్పారు. ఈ వ్యాధిని ప్రారంభంలో గుర్తించగలిగితే అంధత్వాన్ని నివారించవచ్చన్నారు. సమస్యను గుర్తించి, సంబంధిత కంటి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స చేయించుకోవాలని సూచించారు.

సాయి మందిరం క్యాలెండర్ ఆవిష్కరణ


నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ

అగనంపూడి: అగనంపూడి షిర్డీసాయి దేవాలయ కమిటీ రూపొందించిన వార్షిక క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. ముందుగా స్వామికి హారతి, పంచామృతాభిషేకాలు, విభూది పూజ, అష్టోత్తర పూజలు చేశారు. తెలంగాణా బీజేపీ కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి గురువారం సాయంత్రం ఆలయంలో విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు వెంకటరమణారెడ్డి, డి.వ్యాసశర్మ, కె.కృష్ణారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

యువశక్తి సదస్సు పోస్టర్ విడుదల

గాజువాక : శ్రీకాకుళం దరి రణస్థలం వద్ద జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 12న నిర్వహించనున్న యువశక్తి సదస్సు పోస్టర్‌ను ఆ పార్టీ పీఏసీ సభ్యుడు కోన తాతారావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ యువతను చైతన్యవంతులను చేయడానికి ఈ సదస్సును తలపెట్టామన్నారు. స్వామి వివేకానంద జయంతి రోజు ఆయన స్ఫూర్తిగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాల అమలు

పెదగంట్యాడ: అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 64వ వార్డు పరిధిలోని దిబ్బపాలెంలో గురువారం ఆయన పర్యటించారు. వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రజలకు చేకూరిన లబ్ధి గురించి వివరించారు. ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. వాటిని వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, నొల్లి భూలోక, కదిరి భూలోక, స్వామి, తాతారావు, గంటిపిల్లి అమ్మోరు, నొల్లి ఎర్రయ్య, కంటుముచ్చు తాతారావు, పద్మ, సమ్మిడి ప్రవీణ్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.


వృద్ధుడికి సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

ఐక్య ఉద్యమాలతో ఉక్కు పరిరక్షణ

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అమ్మాలనుకోవడం అత్యంత దారుణమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఐక్య ఉద్యమాలతో స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించుకుంటామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 693వ రోజు, గురువారం టి.టి.పీ. ఆర్.ఇ.డి, పీ.ఇ.ఎం, స్టోర్స్, ఎస్.ఇ.డి విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కేఎస్ఎన్.రావు, జె.రామకృష్ణ, యు.రామస్వామి, జి.బోసుబాబు, గుమ్మడి నరేంద్ర, డి.శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు. ప్రాణత్యాగాలతో నిర్మించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం కానివ్వబోమని స్పష్టం చేశారు. పోరాటాన్ని విడవకుండా, నిరంతరాయంగా కొనసాగించడం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఈ నెల 30న నిర్వహించ తలపెట్టిన ఉక్కు ప్రజాగర్జన బహిరంగ సభలో కార్మికులందరూ స్వచ్ఛందంగా పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బి.ఎం.ఎల్ నాయుడు, కె.అవతారం, బి.మహేష్, మంత్రి గోపి, ఎమ్.మద్రినాయుడు, కె.జగ్గారావు, అంజనేయులు, సత్యనారాయణ, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.


693వ రోజు దీక్షా శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

పన్నులు చెల్లించి సహకరించాలి

పెదగంట్యాడ: ప్రతి ఒక్కరూ పన్నులు సకాలంలో చెల్లించి విశాఖ నగరాభివృద్ధికి సహకరించాలని జీవీఎంసీ జోన్–6 జోనల్ కమిషనర్ సింహాచలం కోరారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధి సీతానగరంలో గురువారం ఆయన పర్యటించారు. ముందుగా సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలసి యూజర్ చార్జీలను వసూలు చేశారు. వలంటీర్ ఎస్.శ్యామల ముందుగా తాను యూజర్ చార్జీలు చెల్లించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులను అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తామని తెలిపారు. మౌలిక వసతుల కల్పనకు కూడా ఈ నిధులు ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో ఏఈ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నర్సింగరావు, ఎస్.రామారావు, పులి వెంకట రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


యూజర్ చార్జీలు వసూలు చేస్తున్న జెడ్సీ సింహాచలం

తిరుమల నగర్‌లో సీడీఎంఏ బృందం పర్యటన

స్వచ్ఛత కార్యక్రమాలపై ప్రశంసలు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి తిరుమలనగర్‌లో సీడీఎంఏ అధికారుల బృందం పర్యటించింది. గాజువాక ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి పర్యటించిన అధికారులు, కాలనీలో చేపట్టిన స్వచ్ఛత కార్యక్రమాలను ప్రశంసించారు. ముఖ్యంగా కాలనీవాసులు చేస్తున్న కమ్యూనిటీ కంపోస్ట్, టెర్రస్ గార్డెన్, ఇంకుడు గుంతలు, చెత్త విభజన, హోం కంపోస్ట్, ప్లాస్టిక్ నిషేధం.. పార్కులు, ఇల్లు, అపార్ట్‌మెంట్ గోడలపై అవగాహన పెయింట్లు, ఖాళీ స్థలంలో తోటల పెంపకం తదితర అంశాలను పరిశీలించి, కాలనీవాసులను అభినందించారు. కార్యక్రమంలో తిరుమలనగర్ అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమానందం, సన్యాసిరావు, వసంతరెడ్డి, భాస్కరరావు, శ్రీరాములు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.


తిరుమల నగర్‌లో టెర్రస్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న సీడీఎంఏ అధికారులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సింహాచలం : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. గురువారం తెల్లవారుజామున పెందుర్తి మండలం రాతిచెరువు వద్ద పెందుర్తి నుంచి ఆనందపురం రహదారిలో ఈ సంఘటన చోటుచేసుకుంది. పెందుర్తి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. విజయనగరం జిల్లా ఎల్.కోట సమీపంలోని గొలజాం గ్రామానికి చెందిన కోట్ని వెంకట సూర్యారావు (36) కొత్తవలస సమీపంలోని ఒక కంపెనీలో పనిచేస్తున్నాడు. అతనికి భార్య, చిన్నపాప ఉన్నారు. ప్రస్తుతం వారు ఆనందపురం మండలం మామిడిలోవలో అత్తవారింట్లో ఉండటంతో, వారిని చూసేందుకు బుధవారం రాత్రి మామిడిలోవ ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. తిరిగి గురువారం తెల్లవారుజామున గొలజాం బయల్దేరాడు. ఈ తరుణంలో రాతిచెరువు వద్ద గతుకుల రోడ్డుపై ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో కిందపడిపోయాడు. వెనుక వస్తున్న లారీ అతనిపై నుంచి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ), ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ ఇవ్వనున్నామని సెంటర్ ఇన్‌చార్జి జి.మాధవశెట్టి తెలిపారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్‌లో మూడు నెలలు, ప్లంబింగ్ అండ్ జనరల్‌లో రెండు నెలల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌కు పదో తరగతి, ఐటీఐ పాస్/ఫెయిల్ అయిన వారు, ప్లంబింగ్ అండ్ జనరల్ ట్రేడుకు 8వ తరగతి పాసైన వారు అర్హులని తెలియజేశారు. అభ్యర్థుల వయసు 18 నుంచి 35 సంవత్సరాలు ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచితంగా బస్‌పాస్ అందజేస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లతో పాటు పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 19లోగా పెదగంట్యాడలోని వేమన ఐటీఐ పక్కన ప్రభుత్వ పాత సాంఘిక సంక్షేమ హాస్టల్ భవనంలోని న్యాక్ శిక్షణ కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో అభ్యర్థులు తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 91332 42666, 94935 28069 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బీజేపీ మహిళా మోర్చా ఉత్తరాంధ్ర ఇన్‌చార్జిగా రోహిణి



గాజువాక: బీజేపీ మహిళా మోర్చా ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జిగా గాజువాక ప్రాంతానికి చెందిన వి.రోహిణి నియమితులయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ గాజువాక కో–ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆమెను అభినందించారు.

హోరాహోరీగా ఎన్నికల ప్రచారం

ఉక్కునగరం: ఓబీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు సమీపించడంతో పోటీలో ఉన్న ప్యానళ్లు ప్రచారంలో జోరు పెంచాయి. గురువారం విలేకరుల సమావేశాలు నిర్వహించి విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టాయి.

'ఓబీసీ ఉద్యోగుల ఐక్యతకు చిచ్చు పెట్టేందుకే..'

స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా, ఓబీసీ ఉద్యోగుల ఐక్యతకు చిచ్చు పెట్టేందుకే సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు ప్యానల్ వేశారని మహాత్మా జ్యోతిరావు పూలే ఫౌండర్స్ ప్యానల్ ప్రధాన కార్యదర్శి నక్క వెంకటరమణ ఆరోపించారు. ఓబీసీ సంఘం కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమపై దుష్ప్రచారాలు చేయడం ద్వారా వారు గెలవాలని యోచిస్తున్నారన్నారు. అధ్యక్షుడు కోమటి రవిశంకర్ మాట్లాడుతూ తమను గెలిపిస్తే ప్లాంట్‌లో ఓబీసీ రిజర్వేషన్లు అమలయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో నెల్లి అప్పలరాజు, కొణతాల శ్రీనివాస్, పిల్లి చంద్రరావు, వి.ఎం. నాయుడు, ఎల్లేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పూలే ఫౌండర్స్ ప్యానల్ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ

పారదర్శకతతో సంఘాన్ని నడిపిస్తాం'

తమను గెలిపిస్తే ఓబీసీ అసోసియేషన్‌ను పారదర్శకతతో నడిపిస్తామని జ్యోతిరావు పూలే యునైటెడ్ ప్యానల్ అధ్యక్షుడు బి.అప్పారావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం సాయంత్రం అంబేడ్కర్ కళాక్షేత్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమను గెలిపిస్తే ఓబీసీ ఉద్యోగుల హక్కుల సాధనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కామేశ్వరరావు, జి.ఆర్.కె. నాయుడు, ప్యానల్ నాయకులు ముసిరి శ్రీనివాసరావు, ఆర్.వి. నారాయణ, ఉండవల్లి శ్రీనివాసరావు, వి. సింహాచలం, గెద్దాడ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యునైటెడ్ ప్యానల్ అధ్యక్షుడు అప్పారావు

పాత్రికేయుల సంక్షేమ బాధ్యత ప్రభుత్వానిదే

విశాఖ స్పోర్ట్స్: అంతర మీడియా స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా గురువారం క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోర్ట్ మైదానంలో ఈ పోటీలను జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాన్యులకు అండగా నిలిచే పాత్రికేయుల సంక్షేమ బాధ్యత ప్రభుత్వానిదేనని చెప్పారు. వీజేఎఫ్‌కు సుదీర్ఘ కాలం సేవలందించిన దుర్గారావు, శ్రీదేవి చానల్ అధినేత రామకృష్ణంరాజు, బీజేపీ నాయకుడు పి.వి. చలపతిరావు, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు మృతికి సంతాపం తెలుపుతూ, రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో వీజేఎఫ్, విస్జా ప్రతినిధులు, క్రికెట్ జట్ల సభ్యులు పాల్గొన్నారు. ఇప్పటికే అథ్లెటిక్స్, ఇండోర్ క్రీడలు ముగియగా.. క్రికెట్ పోటీలు ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

లోకల్ చానల్, కెమెరామెన్ జట్ల విజయం

తొలిరోజు జరిగిన పోటీల్లో లోకల్ చానల్ జట్టు ఐదు వికెట్ల తేడాతో ప్రజాశక్తి జట్టుపై విజయం సాధించింది. ప్రజాశక్తి జట్టు తొలుత బ్యాటింగ్ చేసి మూడు వికెట్లకు 87 పరుగులు చేయగా.. లోకల్ చానల్ జట్టు ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్నందుకుంది. మరో పోటీలో కెమెరామెన్ జట్టు ఆరు వికెట్లకు 127 పరుగులు చేయగా.. వెబ్ చానల్స్ జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 84 పరుగులతో ఆటను ముగించింది.

86వ వార్డులో రూ.60 లక్షలతో అభివృద్ధి పనులు

కూర్మన్నపాలెం: నియోజకవర్గ పరిధిలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గాజువాకను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా, సీఎం ఆశయాల మేరకు కృషి చేస్తున్నామన్నారు. జీవీఎంసీ 86వ వార్డు పరిధి శివాజీనగర్, ఉప్పరకాలనీల్లో సుమారు 20 లక్షల రూపాయలతో రోడ్లు, బాలాజీనగర్‌లో మరో 40 లక్షల రూపాయల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న బీటీ రోడ్లు, తదితర అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు, రాష్ట్ర వైఎస్సార్ సీపీ అదనపు కార్యదర్శి దామా సుబ్బారావు, జెడ్సీ సింహాచలం, ఉద్యానవన ఏఈ తులసి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, బాలాజీనగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్


మహిళకు పెన్షన్ అందజేస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి


66వ వార్డులో పింఛన్లు అందజేస్తున్న కార్పొరేటర్ ఇమ్రాన్

పెదగంట్యాడ: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందజేస్తున్నామని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. వార్డులోని అన్ని సచివాలయాల పరిధిలో మొత్తం 55 కొత్త పెన్షన్లు మంజూరయ్యాయని తెలిపారు. వీటిని గురువారం ఆయన పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు అండగా ఉండేందుకు.. ప్రతి నెలా వారికి ఆర్థికంగా ఆదుకునేందుకు వైఎస్సార్ పెన్షన్ కానుక పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. భవిష్యత్తులో మరిన్ని పథకాలను అమలు చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆయా సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు, సీవో సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ వార్డు నాయకులు పాల్గొన్నారు.

66వ వార్డులో..

గాజువాక: 66వ వార్డులో కొత్తగా మంజూరైన పింఛన్లను ఆ వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్ లబ్ధిదారులకు గురువారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీజీబీ డైరెక్టర్ అలియా సురాని, నాయకులు జగదీష్‌రెడ్డి, పెదిరెడ్ల ఈశ్వరరావు, షఫీ, కరణం వేణుగోపాలరావు, గూన శ్రీను తదితరులు పాల్గొన్నారు.


88వ వార్డులో మహిళకు పెన్షన్ అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

థాంక్యూ సీఎం సర్

అగనంపూడి: ఇచ్చిన మాట మీద నిలబడి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని వైఎస్సార్‌సీపీ 88వ వార్డు ఇన్‌చార్జ్ గంద్రెడ్డి కనకమహాలక్ష్మినాయుడు అన్నారు. పింఛన్ల పెంపు, కొత్త పింఛన్ల మంజూరుపై కృతజ్ఞతలు తెలుపుతూ వార్డు పరిధిలోని వెదుళ్లనరవలో ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సర్వసిద్ధి బొరయ్యనాయుడు, చట్టి తాతారావు, శేఖరమంత్రి శ్రీనివాసరావు, కల్లేపల్లి ఎర్నిబాబు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు అన్యాయం చేస్తే తిరుగుబాటు

- అఖిల పక్ష నేతల హెచ్చరిక
- ముగిసిన 24గంటల నిరవధిక నిరాహార దీక్ష

అగనంపూడి: ఆంధ్రుల ఆకాంక్షలను కేంద్ర ప్రభుత్వం కనీసం పరిగణనలోకి తీసుకోపోవడం దారుణమని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, కో–కన్వీనర్లు అయోధ్యరామ్, కె.సత్యనారాయణరావు, జనసేన జిల్లా నాయకులు కోన తాతారావు, గడసాల అప్పారావు అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో అగనంపూడి కూడలిలో 24 గంటల నిరవధిక నిరసన దీక్షా శిబిరం ముగింపు కార్యక్రమంలో వారు మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ అమ్మవద్దని రాష్ట్రప్రభుత్వం, స్థానిక సంస్థలు, ప్రజలు వ్యతిరేకిస్తున్నా.. కేంద్ర పాలకులకు పట్టకపోవడం దారుణమన్నారు. గుజరాత్‌కు చెందిన వ్యాపారులు, సంస్థలకు వేలాది కోట్లను రుణ మాఫీ పేరుతో ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, పోరాట కమిటీ నాయకులు పరంధామయ్య, నెల్లి శ్రీనివాసరావు, దాసరి త్రినాథ్ మాట్లాడుతూ నిర్వాసితులకు అన్యాయం చేస్తే తిరుగుబాటు తప్పదన్నారు. లక్షల కోట్ల విలువైన భూములపై నిర్వాసితులకు పూర్తి హక్కు ఉందని, వాటితో వ్యాపారం చేయాలనుకుంటే తగిన గుణపాఠం తప్పదన్నారు. నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. దీక్షా శిబిరానికి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో విందుల వెంకటరమణ, బలిరెడ్డి సత్యనారాయణ, యలమంచిలి బుజ్జి, వంకర రాము, మోటూరి వెంకటరమణ, బోసుబాబు, కరణం పైడిరాజు, బొబ్బరి సూర్య తదితరులు పాల్గొన్నారు.


నిమ్మరసం అందించి దీక్షను విరమింపజేస్తున్న కో–కన్వీనర్ అయోధ్యరామ్

8న వైదిక సదస్సు

సీతంపేట(విశాఖ ఉత్తర): శంకరమఠంలో ఈ నెల 8వ తేదీన కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి పురోహిత, అర్చక వర్గ సభ్యులతో వైదిక సదస్సు నిర్వహించనున్నారు. విజయయాత్ర సందర్భంగా ఆయన శంకరమఠానికి ఇటీవల విచ్చేయగా.. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఆదివారం సాయంత్రం 6 గంటలకు వైదిక సదస్సు నిర్వహిస్తున్నారని.. అర్చక, పురోహితులు స్వామి అనుగ్రహాన్ని పొందగలరని శంకరమఠం ప్రతినిధులు ఓ ప్రకటనలో కోరారు. సదస్సులో పాల్గొనే వారు 94415 03935, 99898 93557లో సంప్రదించవచ్చు.